క్లుప్తంగా

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



నెల్లూరు(బారకాసు): చిన్నబజార్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత గ్యాస్‌కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉజ్వల యోజన కింద అర్హులైన ఏడుగురు లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు జగదీష్, కుమార్, రాము, పెంచలయ్య, నరేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు హేయం



నెల్లూరు(బారకాసు): క్రైస్తవులపై దాడులు హేయమని క్రైస్తవ ఐక్యవేదిక నాయకుడు కలివెల ఎలీషాకుమార్ ఖండించారు. నగరంలోని డానీహాల్లో శనివారం జరిగిన క్రైస్తవ నాయకుల, పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 దేశంలోని ఏ పౌరుడైనా వారి ఇష్టమైన మతాన్ని స్వీకరించవచ్చని, ఆచరించవచ్చని, ప్రచారం చేసుకోవచ్చని స్పష్టంగా చెబుతుందన్నారు. అయినప్పటికీ క్రైస్తవులు, చర్చిలపై మతోన్మాదులు దాడులకు పాల్పడడం హేయమన్నారు. హైదరాబాద్‌లో చర్చిపై జరిగిన దాడిని నెల్లూరు క్రైస్తవ జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇలాంటి ఘటనలను క్రైస్తవులంతా ఏకమై ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. క్రైస్తవులపై దాడులపై రాజకీయ నాయకులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. త్వరలోనే నెల్లూరులో క్రైస్తవ ఐక్య గర్జన మహాసభను నిర్వహించి క్రైస్తవుల సత్తా చాటుతామన్నారు. జేఏసీ నాయకులు చంద్రశేఖర్, వెంకయ్య, రాజశేఖర్, దయాసాగర్, సురేంద్రబాబు, హృదయ్‌కుమార్, హనోక్, ప్రభుకుమార్, దైవా.దీనం, దాస్ తదితరులు పాల్గొన్నారు.

20న మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం

పొదలకూరు : పట్టణంలోని కామాక్షితాయి సమేత రామలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వరాలయాల్లో ఈ నెల 20న మాఘమాసం, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు దేవస్థానం ప్రధానార్చకుడు పీబీఎస్‌వీ ప్రసాద్ స్వామి శనివారం తెలిపారు. శివకేశవులకు ప్రీతికరమైన భీష్మ ఏకాదశి రోజున ఉదయం 8 గంటలకు రుద్రాభిషేకంతో పాటు సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 18వ వార్డు మంగళకట్టలోని పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. జొన్నవాడలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ మోర్ల జయంతి, భరత్‌కు నగదు అందజేశారు. అలాగే చెల్లాయపాళెం ఆర్బీకేలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.25వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కౌన్సిలర్ జయంతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వెంకటేశ్వరస్వామికి హనుమంత సేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం లో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు దేవదేవేరులను గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు దేవాంగ సంక్షేమ సంఘ సమావేశం

కోవూరు : పట్టణంలోని బుద్ధి పద్మావతి కల్యాణ మండపంలో కోవూరు దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పి.మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో దేవాంగ సంక్షేమ సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి భువనగిరి మల్లికార్జునరావు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో శ్రీరామలింగ చాముండేశ్వరీదేవి మహాకుంభాభిషేకం నిర్వహణపై చర్చిస్తామన్నారు. సమావేశానికి దేవాంగులు హాజరుకావాలని కోరారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్: రూరల్ నియోజకవర్గంలో వలంటీర్ల సేవలు ఎంతో అభినందనీయమని ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. నగరంలోని మహేశ్వరిపరమేశ్వరి కల్యాణ మండపంలో వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఆదాల పాల్గొని రూరల్ నియోజకవర్గంలోని 20 నుంచి 24వ డివిజన్ వరకు ఉన్న సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో గొప్ప ఆలోచనతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావడం గర్వించదగిన విషయమన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విషయంలో వలంటీర్ల సేవలు మరవలేనివన్నారు. ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే వైఎస్సార్ పింఛన్ కానుకను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేస్తూ అందరి మన్ననలను పొందుతున్నారన్నారు. వలంటీర్ల సేవలను ప్రభుత్వం గుర్తించిందని, భవిష్యత్‌లో వారికి మేలు చేకూర్చే విధంగా కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. వలంటీర్ల అంకితభావానికి పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డివిజన్ల పార్టీ ఇన్‌చార్జులు రావు శ్రీనివాసరావు, తాళ్లూరి సురేష్, కార్పొరేటర్లు గౌరి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పుల్లారెడ్డి, సునీల్, మురళి, సురేంద్రరెడ్డి, శేఖర్, రామలింగారెడ్డి, జగదీష్‌రెడ్డి, నవాబ్‌జాన్, కోఆప్షన్ సభ్యురాలు మొబీనా, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం

రూరల్ నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నగరంలోని తన నివాసంలో 17, 18 డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలన్నారు. శాంతియుతంగా ఎన్నికలకు వెళదామన్నారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి అవసరమైన చర్యలను పార్టీ చేపడుతుందన్నారు. ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు ఏమాత్రం మరువరన్నారు. తాను పూర్తిస్థాయిలో పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. రూరల్ నియోజకవర్గంలో అరాచక పాలనకు చరమగీతం పాడుదామన్నారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు సుధాకర్, అశోక్, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు మొబీనా, బీసీ నేత హరిబాబుయాదవ్, నాయకులు ఏసునాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆదాల

ఎమ్మెల్సీని కలిసిన ఏపీజీఈఎఫ్ నాయకులు



నెల్లూరు(టౌన్): ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులోని ఆయన నివాసంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంపై ఎమ్మెల్సీను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఉపాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, వీఆర్ఏల సంఘం రాష్ట్రాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏపీజీఎఫ్ జిల్లా కోశాధికారి బాలరాజు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా నాయకులు సునీత, అశోక్, ఉమర్ పాల్గొన్నారు.

రేపు శివాజీ నగరోత్సవం



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న మురళీరెడ్డి

నెల్లూరు సిటీ: మహావీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19న నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను నగరంలోని వీఆర్సీ సెంటర్‌లోని ఉత్సవ కమిటీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 ఏళ్లుగా శివాజీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సోమవారం వీఆర్సీ మైదానం నుంచి గాంధీబొమ్మ, శివాజీ సెంటర్, ఏసీ సెంటర్, కనకమహల్, కొత్తహాల్, సండేమార్కెట్ మీదుగా తిరిగి వీఆర్సీ మైదానం వరకు నగరోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. నగర ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, ఉపాధ్యక్షులు పీజీ మహేష్, కార్యవర్గ సభ్యులు అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాలను ఆశీర్వదించండి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ దాసరి అమృత

నెల్లూరు(బారకాసు): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని 31వ డివిజన్ కార్పొరేటర్ దాసరి అమృత కోరారు. ఆదాలకు మద్దతుగా 31వ డివిజన్ పరిధిలోని అరవిందనగర్‌లోని ఇంటింటికి తిరిగి శనివారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి రాబోయే ఎన్నికల్లో ఓటేయాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి జరిగిందంటే అది కేవలం ఎంపీ ఆదాల వల్లేనన్నారు. మంచి మనసున్న వ్యక్తి, అందరిని కలుపుకుని పోయే వ్యక్తిత్వం, వివాద రహితుడైన ఆదాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

24న ఓటు వినియోగంపై చర్చా వేదిక



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెల్లూరు(బారకాసు): పురమందిరం ప్రాంగణంలోని రీడింగ్‌రూములో ఈ నెల 24 ఓటు వినియోగంపై చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఏ ట్రస్ట్ ఫర్ ఆల్ సంస్థ అధ్యక్షులు అలహరి వెంకటేష్, చక్రవర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను నగరంలోని స్వతంత్ర పార్కులో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లకు ప్రోగ్రెస్ కార్డులు అందజేసి గుర్తింపు, గౌరవం ఇవ్వడం వల్ల ప్రతి ఎన్నికల్లో 90 శాతం ఓట్లు నమోదవుతాయన్నారు. ఒక్క దొంగ ఓటు నమోదు కాదన్నారు. ఓటరు కాస్టింగ్ ప్రోగ్రెస్ కార్డు, ఇండియా ఓటర్స్ యాప్‌ను అమల్లోకి తీసుకురావాలనే అంశంపై నిర్వహిస్తున్న చర్చా వేదికలో నగర ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగంశెట్టి మురళి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, వీఎస్‌రాజు, శామ్యూల్, శ్రీను, సునీల్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

- ఈఆర్వో, కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విభాగాధికారులు, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని నగర నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ విభాగంలో నగర నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సెక్టార్ అధికారులు, ఏఈఆర్వోలు, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రెయినర్స్‌తో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను క్రమశిక్షణతో పాటించాలన్నారు. ఎన్నికల సంఘం అందించే శిక్షణలో ఈవీఎం మెషీన్లు, వీవీ ప్యాట్లపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. మాక్ పోలింగ్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓలు దేవీకుమారి, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, సెక్టార్ అధికారులు, ఏఎల్ఎంటీలు, ఈడీటీ స్వర్ణ, టీపీఆర్‌ఓ ప్రసాద్, మేనేజర్ ఇనయతుల్లా, చక్రపాణి పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించండి

ఓటరు తుది జాబితా విడుదలైన తరువాత ఆన్‌లైన్ ద్వారా అందుకున్న ఫారం 6,7,8 ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో త్వరితగతిన విచారించి జాబితాలో సవరణలు చేయాలని ఎన్నికల విభాగాధికారులను నగర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలోని సమావేశ మందిరంలో నగర నియోజకవర్గ ఎన్నికల విభాగాధికారులు, సూపర్‌వైజర్లతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేసిన దరఖాస్తులను సవరణకు పైస్థాయి అధికారులకు త్వరితగతిన బదిలీచేయాలని సూచించారు.

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట కూనం సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా అరవ అషా



నెల్లూరు(వేదాయపాళెం): మాలమహానాడు విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా అరవ అషా నియమితులయ్యారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో మాలమహానాడు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అషాకు నియామక పత్రాన్ని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ అందజేశారు. మాల మహానాడు జిల్లా కార్యవర్గం నేతలు అరుణక్క పాకర్, కాయల మేరీ, చేను సుజాతమ్మ, ఉషా, కొప్పాలు రఘు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణికి వినతి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఏపీ కోఆపరేటీవ్ సెంట్రల్‌బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి కోఆపరేటీవ్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రతి నెలా రూ.5వేలు పెన్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, సెక్రటరీ రవికుమార్, ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, వర్ధన్, దయాకర్‌రెడ్డి, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఆర్డీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సండే మార్కెట్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ విద్యుత్‌శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సండేమార్కెట్, పొగతోట, ట్రంక్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



నెల్లూరురూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు నగరంలోని నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. రాష్ట్ర జేఏసీ డిప్యూటీ సెక్రటరీ శివారెడ్డి పాల్గొని మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. నాయకులు రామకృష్ణారెడ్డి, మార్కండేయ, పెంచల్‌రావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



43వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఖలీల్ అహ్మద్

- నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్

నెల్లూరు (స్టౌన్‌హౌస్‌పేట) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను నెల్లూరు నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నియమించారని, ప్రతిఒక్కరూ తనకు సహకారం అందించి రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్ కోరారు. నగరంలోని 43వ డివిజన్‌లో గడప గడపకు కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రతిఒక్కరికీ అండగా ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్పొరేటర్ కరీముల్లా, మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేనీ, రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ రఫూఉద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునీర్‌సిద్దిక్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అబ్దుల్‌అలీమ్, జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్దిక్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరామొహిద్దీన్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు



నెల్లూరురూరల్: రూరల్ పరిధిలోని సుపర్తిపాడులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పుష్కర కుంబాభిషేక మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా రెండో రోజు శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు చేశారు. వేదపారాయణం, విశేషసంధి, అష్టబంధన సమర్పణ, సుబ్రహ్మణ్యేశ్వర సహిత సర్వమంత్ర హోమం, యాగ మండప పూజ, 108 ద్రవ్యాలతో నాగేంద్రస్వామి,జంట నాగదేవతల ప్రతిమలకు అభిషేకాలు జరిపారు. అష్టబంధనం పూజలో భాగంగా దంపతులతో రోళ్లు, రోకళ్లకు పూజలు చేశారు. అనంతరం అష్టబంధన ప్రసాదాన్ని దంచి తయారుచేసి స్వామివారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నెల్లూరు(బారకాసు): వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నగరంలోని కొండాయపాళెం చర్చి సెంటర్, జెడ్పీ కాలనీలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై శనివారం అవగాహన కల్పించారు. కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు పీఎం స్వనిధి పథకం, ముద్రలోన్, బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ ప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కార్పొరేషన్ ఉద్యానశాఖ ఏడీ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్‌పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయిసూరి, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన పీఆర్టీయూ నాయకులు



డీఈఓను సత్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

నెల్లూరు(టౌన్): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ రామారావును పీఆర్టీయూ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరాజు, తిరుమలయ్య మాట్లాడుతూ త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు, పదో తరగతి పరీక్షల విధులకు వయస్సు మళ్లిన, అనారోగ్యంతో బాధపడుతున్న వారితో పాటు చిన్న పిల్లల తల్లులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్టీయూ నాయకులు శ్రీనివాసులు, చెన్నయ్య ఉన్నారు.